క్లుప్తంగా

ఆరోగ్యమిత్రలకు ప్రశంసాపత్రాల అందజేత



చిలకలపూడి(మచిలీపట్నం): ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్యమిత్రలకు మంగళవారం కలెక్టర్ పి. రాజాబాబు ప్రశంసాపత్రాలను అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యమిత్ర పురస్కారంలో భాగంగా ఏప్రిల్‌కు సంబంధించి హైదరాబాద్ కంటి ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యమిత్ర కన్నా ఈశ్వరమ్మ, మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న బచ్చు తులసీ కృష్ణబాబులకు కలెక్టర్ రాజాబాబు ఆయన చాంబర్‌లో ప్రశంసాపత్రాలు, రూ. 5 వేలు నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి గీతాబాయి, ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.సుమ పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మచిలీపట్నంటౌన్: ఏపీఎస్ ఆర్టీసీ మచిలీపట్నం డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు, సలహాలు తెలుసుకునేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని డిపో మేనేజర్ టి. పెద్దిరాజు మంగళవారం తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య ప్రయాణికులు సెల్: 99592 25462 నెంబర్‌కు కాల్ చేసి సమస్యలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు.

అక్రమ నీటి మోటార్ల తొలగింపు



తలగడదీవి(నాగాయలంక): స్థానిక పంచాయతీ పరిధిలోని ప్రైవేటు నీటి కుళాయిలకు నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా వినియోగిస్తున్న నీటి మోటర్లను మంగళవారం సర్పంచ్ భోగాది వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో ఉద్యోగులు తొలగించారు. ఈ సందర్భంగా తొమ్మిది మోటార్లను తొలగించి పంచాయతీ కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో ఉప సర్పంచి వర్రే శ్రీమన్నారాయణ, కార్యదర్శి గ్రేడ్–5 సురేష్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

25న యాదవ వివాహ పరిచయ వేదిక

మచిలీపట్నంటౌన్: యాదవ సేవా సంఘం మచిలీపట్నం నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో యాదవ వివాహ పరిచయ వేదిక కార్యక్రమం ఈ నెల 25వ తేదీన ఏర్పాటు చేశామని సంఘ ప్రతినిధులు పల్లపాటి చినబాబు, బొర్రా శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. స్థానిక లలితా కన్వెన్షన్ హాల్‌లో ఉదయం ఏడు గంటల నుంచి రిజిస్ట్రేషన్, పరిచయ వేదిక కార్యక్రమం జరుగుతుందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో యాదవ కులానికి చెందిన వారు పరిచయ వేదికలో పాల్గొనవచ్చునని చెప్పారు.

పాస్టర్లకు రగ్గులు అందజేత

అవనిగడ్డ: శ్రీరామా వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిషోర్ నాయుడు ఆధ్వర్యంలో 25 మంది పాస్టర్లకు మంగళవారం రగ్గులు పంపిణీ చేశారు. స్థానిక సీయోను చర్చిలో జరిగిన కార్యక్రమంలో తోట నరసింహనాయుడు, ఎన్.ఏసు దాసు, స్టీవెన్, డానియేల్ పాల్గొన్నారు.

లాసెట్‌లో చల్లపల్లి యువకునికి స్టేట్ 8వ ర్యాంకు



చల్లపల్లి: ఏపీ లా సెట్–2023 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో చల్లపల్లికి చెందిన యువకుడు రాష్ట్ర స్థాయిలో ఎనిమిదో ర్యాంకు సాధించాడు. చల్లపల్లి నారాయణరావు నగర్‌కు చెందిన దాసరి మెహర్ హేమంత్ 91 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 8వ ర్యాంకు సాధించాడు. తండ్రి దాసరి వెంకట శివరామ ప్రసాద్ కొంత కాలం కిందట మృతి చెందగా.. తల్లి మెహర్ వాణి, సోదరునితో కలిసి జీవిస్తున్నాడు. న్యాయవాది కావాలనే కోరికతో ఈ పరీక్ష రాసినట్లు హేమంత్ తెలిపాడు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



గూడూరు: యోగా సాధన ద్వారా వ్యాధులు దరిచేరవని, యోగా సాధకులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారతారని ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎంపీపీ మాట్లాడుతూ యోగా ఉపయోగాలను వివరించారు. యోగా సాధనతో ఆరోగ్యవంతులు కావాలని చెప్పారు. సర్పంచి లింగం సులోచనారాణి, రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు, సీహెచ్‌సీ డైరెక్టర్ బత్తిన త్రినాథ్, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొల్లు వాసు, హెచ్‌ఎం పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్‌కు మహర్దశ





అంబేడ్కర్ భవన్‌ను పరిశీలిస్తున్న స్పైసెస్ ఆర్కిటెక్ట్ సంస్థ ప్రతినిధులు, కమిషనర్ చంద్రయ్య తదితరులు : శిథిలావస్థకు చేరిన అంబేడ్కర్ భవన్

- రూ. 5 కోట్లు కేటాయించిన సీఎం జగన్
- భవన పునర్నిర్మాణానికి సన్నాహాలు
- భవనాన్ని పరిశీలించిన స్పైసెస్ ఆర్కిటెక్ట్ కంపెనీ ప్రతినిధులు
- నియోజకవర్గ దళితుల హర్షాతిరేకం

మచిలీపట్నంటౌన్: నగరంలోని అంబేడ్కర్ భవన్ శిథిలావస్థకు చేరింది. 2004లో ప్రారంభమైన ఈ భవనం శ్లాబు పెచ్చులు ఊడిపడుతున్నాయి. ఈ భవనం స్థానంలో నూతన భవనం నిర్మించేందుకు నిధులు కేటాయించాలని గత నెల 22వ తేదీన మచిలీపట్నం పోర్టు పనులు ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని కోరారు. స్పందించిన సీఎం వైఎస్ జగన్ ఈ భవనం పునర్నిర్మాణానికి రూ. 5 కోట్లు కేటాయించారు. దీంతో ఈ భవనం స్థానంలో నూతన భవనం నిర్మించే దిశగా అడుగులు పడుతున్నాయి. విజయవాడకు చెందిన స్పైసెస్ ఆర్కిటెక్ట్ సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరావు, బలసాని కిరణ్‌కుమార్ మంగళవారం అంబేడ్కర్ భవన్‌ను పరిశీలించారు. మునిసిపల్ కమిషనర్ జి. చంద్రయ్య, ఎంఈ శ్రీకాంత్, కో–ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్ నోబుల్‌తో కలిసి వారు శిథిలమైన భవనాన్ని పరిశీలించారు.

అధునాతన హంగులతో భవన నిర్మాణం

అంబేడ్కర్ భవన్‌ను అన్ని సదుపాయాలతో అధునాతన హంగులతో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. దాదాపు రెండు వేల గజాల స్థలంలో ప్రభుత్వ నిధులతో భవనాన్ని నిర్మించేందుకు నిర్ణయించారు. అధునాత హంగులతో భవనం అందుబాటులోకి వస్తే వివాహాది, శుభకార్యాలకు, సభలు, సమావేశాలు నిర్వహించేందుకు భవనం అందుబాటులోకి రానుంది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో మూసివేశారు.

టీడీపీ పాలకుల నిర్లక్ష్యంతో 19 ఏళ్లకే శిథిలం..

చంద్రబాబు పాలనలో అంచెలంచెలుగా నిర్మితమైన ఈ భవనం 19 సంవత్సరాలకే శిథిలమైంది. నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వకపోవడంతో శ్లాబులు, కాంక్రీట్ దిమ్మెలు శిథిలమై పెచ్చులూడిపడుతున్నాయి. 1998 జూలై 14వ తేదీన భవన నిర్మాణానికి ఆనాటి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. దాదాపు ఆరేళ్ల పాటు భవన నిర్మాణం మందకొడిగా కొనసాగింది. 2004 ఎన్నికల సమయంలో ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా టీడీపీ పాలకులు హడావుడిగా భవనాన్ని ప్రారంభించారు. సుదీర్ఘకాలం భవన నిర్మాణం సాగినా సరైన ప్రమాణాలు, పర్యవేక్షణ లేకుండా నిర్మాణం చేయడంతో శిథిలమైంది.

దళితుల్లో హర్షాతిరేకాలు..

అంబేడ్కర్ భవన్ పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 5 కోట్లు నిధులు కేటాయించడం, పనులు నిర్వహించేందుకుగానూ స్పైసెస్ ఆర్కిటెక్ట్ సంస్థ ప్రతినిధులు భవనాన్ని పరిశీలించడంతో నియోజకవర్గంలోని దళితులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. అధునాతన హంగులతో, నాణ్యతా ప్రమాణాలతో భవన నిర్మాణం చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

సీఎం జగన్ కు రుణపడి ఉంటాం



శిథిలమైన అంబేడ్కర్ భవన్ పునర్నిర్మాణానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ. 5 కోట్లు కేటాయించడం, పనులు వేగంగా నిర్వహించే దిశగా చర్యలు తీసుకోవడం అభినందనీయం. అంబేడ్కర్ భవన్ అభివృద్ధికి కృషి చేసిన సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే పేర్ని నానిలకు నియోజకవర్గ దళితులు రుణపడి ఉంటారు.

– బందెల థామస్ నోబుల్, దళిత నాయకుడు

ఓఎన్‌జీఎస్ ప్లాంట్‌లతో పంటలకు నష్టం

చర్యలు తీసుకోవాలని రైతుల వినతి

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): వక్కపట్లవారిపాలెం సమీపంలో ఓఎన్‌జీఎస్–సీజీఎస్ ప్లాంట్ల నిర్మాణంతో పంటలకు నష్టం వాటిల్లి తీవ్రంగా నష్టపోతున్నామని పరిసరాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు అంబటి లక్ష్మణ ప్రసాద్ (పాలెం చిన్నా) నేతృత్వంలో యాభై మంది రైతులు జిల్లా స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఈ ప్లాంట్ల చుట్టూ సామాన్య రైతులే ఉన్నారని చెప్పారు. ఓఎన్‌జీసీ యాజమాన్యం నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకోనందున లోడింగ్ సమయాల్లో క్రూడాయిల్ వంటి వ్యర్థాలు పంట పొలాల్లోకి చేరుతున్నాయని, వర్షాకాలంలో పంటకాలువ, డ్రెయిన్లలోకి ఆయిల్ జిడ్డు చేరి పొలాలకు నష్టం కలిగిస్తోందని చెప్పారు. మంచి నీటి కాలువలు కూడా కాలుష్యం బారిన పడుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని మిగిలిన ప్రాంతాల్లో రక్షణ, కాలుష్య నివారణ నిబంధనలు పాటిస్తున్న ఓఎన్‌జీసీ యూనిట్ల యాజమాన్యం దివిసీమలో ఇలాంటి నిబంధనలు పాటించకపోవడంతో రైతులకు పంట నష్టం కలుగుతోందని చెప్పారు. ఫిర్యాదు నకళ్లను రాజమండ్రిలోని ఓఎన్‌జీసీ ఈడీ, ఇతర ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులకు, పర్యావరణ కాలుష్య నివారణ బోర్డు (విజయవాడ) డైరెక్టర్, జలవనరుల శాఖ ఎస్ఈలకు పంపామన్నారు. రైతుల ఆందోళనపై వివరణ కోరగా ఈ సమస్యపై విచారణ చేసి బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని తహసీల్దార్ విమలకుమారి తెలిపారు.

వెదసాగుపై రైతుల ఆసక్తి



రామవరపుమోడి గ్రామంలో పొడి నేలలోనే విత్తనాలు జల్లుతున్న రైతులు

బంటుమిల్లి: ఈ ఏడాది వరుణుడి రాక ఆలస్యమైంది. మండల పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు సార్వా విత్తనాలు వెదజల్లుతున్నారు. గత వారం 15 రోజులుగా విత్తనాలు పొడి నేలల్లోనే వెదచల్లారు. సాగు ఖర్చులు, సమయం కలిసి వస్తాయని భావించిన రైతులు వెద పద్ధతిని అవలంభిస్తున్నారు. మండలంలో ఎక్కువమంది రైతులు వరి సాగుకు వెద పద్ధతిని అవలంభిస్తున్నారు. వర్షాలు ఆలస్యం కావడంతో రైతులు నారుమళ్లను నేటికీ సిద్ధం చేయలేదు. గత సంవత్సరం ఈ రోజుల్లో నారుమళ్లు పచ్చగా కళకళ లాడాయి. కాలువలకు నీరు విడుదల చేసినా పూర్తి స్థాయిలో నీటి సరఫరా కావడం లేదు. దీనిపై మండల వ్యవసాయ శాఖాధికారి శివరామకృష్ణ మాట్లాడుతూ గత సంవత్సరం కన్నా ఈ ఏడాది వర్షాలు 15 రోజులు ఆలస్యమయ్యాయన్నారు. అయినా రైతులు సమారు 8 వేల ఎకరాల్లో విత్తనాలు చల్లారని, వర్షం కురిసిన తరువాత మొలక శాతాన్ని బట్టి అంచనాలు వేస్తామని తెలిపారు.

మత్తు పదార్థాలపై అవగాహన



మాట్లాడుతున్న నవజీవన్ బాలభవన్ కోఆర్డినేటర్ లీలావతి

మండవల్లి : విద్యార్థులు మత్తుకు బానిసలై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని నీతోడు మానసిక వికాస కేంద్రం (ఎన్ఐసీసీ) డాన్‌బోస్కో నవజీవన్ బాలభవన్ విజయవాడ కో ఆర్డినేటర్ టి.లీలావతి అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని భైరవపట్నం గ్రామంలోని యూపీ స్కూల్‌లో హెచ్‌ఎం ఎం.సుబ్రహ్మణ్యం అధ్యక్షతన విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. యువతీ యువకులను మత్తు పదార్థాల నుంచి రక్షిద్దాం మత్తు పదార్థాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు వంటి నినాదాలు విద్యార్థులతో పలికించారు. ఉపాధ్యాయులు జి.సముద్రుడు, కె.వెంకటకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో పాలకాయతిప్ప, హంసలదీవి గ్రామాలతో పాటు ఉల్లిపాలెం, వేణుగోపాలపురంలోని చెరువులకు వెళ్లే లైన్లలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ప్రశాంతంగా ఈసెట్ పరీక్ష

పెడన: మండలంలోని నందమూరు శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఈసెట్ 2023 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 నుండి 12 వరకు జరిగిన మొదటి సెషన్‌లో 128 మందికిగాను 124 మంది హాజరయ్యారు. అలాగే రెండో సెషన్‌లో మధ్యాహ్నం మూడు గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన పరీక్షకు 130 మందికిగాను 128 మంది హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ బీఆర్ఎస్ రెడ్డి, టెస్ట్ సెంటర్ అడ్మిన్ పి. అశోక్‌కుమార్ తెలిపారు.

పాఠశాలకు 20 సీసీ కెమేరాల వితరణ



పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమేరాలను ప్రారంభిస్తున్న దాతలు కోనేరు బ్రదర్స్

మోపిదేవి: స్థానిక జెడ్పీ పాఠశాల, ప్లస్ బాలికల కళాశాలకు రూ. 1,16,116 విలువగల 20 సీసీ కెమేరాలను దాతలు కోనేరు పద్మనాభ ప్రసాద్, కోనేరు సుందర్‌సింగ్, కోనేరు రమేష్‌బాబు అందజేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో కోనేరు కృష్ణమూర్తి, నాగేంద్రమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు వీటిని ఏర్పాటుచేసి ప్రారంభించారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయంతి తెలిపారు. సీసీ కెమేరాల ఉపయోగాలను విశ్రాంత ఉపాధ్యాయులు రావి సుధాకర్‌రెడ్డి వివరించారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, ఉప సర్పంచ్ కోనేరు సుందర్ సింగ్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంటల సాగు హక్కు పత్రాలపై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్

గుడ్లవల్లేరు: పంట సాగు హక్కు పత్రాలపై రైతులకు అవగాహన అవసరమని తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ మస్తానా అన్నారు. వడ్లమన్నాడు ఆర్బీకేలో మంగళవారం పంట సాగు హక్కు పత్రాలపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. భూయజమానికి ఏ విధమైన ఇబ్బంది లేకుండా సాగుదారుడికి సాగులో వచ్చే నష్టాలను, పంట ఉత్పత్తులను నేరుగా ఆర్బీకే ద్వారా విక్రయించుకోవచ్చన్నారు. ఇందుకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అవకాశం కల్పించిందని వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకరరావు అన్నారు. ఏఓ సునీల్, ఎంపీటీసీ మండా దిలీప్, సర్పంచి కటికల జ్యోతిలత, ఆర్.ఐ బేగం, వీఆర్వో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు(తోట్లవల్లూరు): కౌలు రైతులందరికీ పంట సాగు హక్కు పత్రాలు ఎంతో ఉపయోగపడతాయని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి అన్నారు. తోట్లవల్లూరు–1 డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం వద్ద కౌలు రైతుల గుర్తింపు కార్డులపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఇది రైతుల ప్రభుత్వమని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు. ఎంఏవో నాగేశ్వరరావు మాట్లాడుతూ సాగు హక్కు పత్రాలు తీసుకున్న కౌలు రైతులు పంటలను ప్రభుత్వం మద్దతు ధరకు అమ్ముకోవచ్చన్నారు. మండల ఉద్యాన శాఖ అధికారి చందు జోసెఫ్ సుందరం మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం ద్వారా పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం రాయితీ ఇస్తుందన్నారు. వీఆర్వో దువ్వూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతులు ఆధారాలతో సంప్రదించి పంట సాగు పత్రాలు పొందవచ్చని అన్నారు.

పమిడిముక్కల: మండలంలోని తాడంకి సచివాలయంలో కౌలు రైతుల గుర్తింపు కార్డులు పంపిణీ ప్రారంభించారు. ఏవో గణేష్‌రెడ్డి, సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, ఎంపీటీసీ కూచిపూడి శ్రీలక్ష్మి కౌలు రైతులకు గుర్తింపు కార్డులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన అవగాహన సదస్సులో ఏవో గణేష్‌రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులకు ఇచ్చే గుర్తింపు కార్డులతో భూయజమానులకు ఏవిధమైన ఇబ్బంది ఉండదన్నారు. కేవలం 11 నెలలు మాత్రమే గుర్తింపు కార్డు పనిచేస్తుందని చెప్పారు. మండలంలో ఈ ఏడాది 2422 కౌలు కార్డులు ఇచ్చే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. వీఏఏ కావ్య, వీఆర్వో వాసు, రైతులు పాల్గొన్నారు.

కూచిపూడి(మొవ్వ): కౌలు రైతులు సీసీఆర్సీ కార్డుల కోసం ఆయా గ్రామాల వీఆర్‌వోలను సంప్రదించాలని తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయప్రసాద్ సూచించారు. మండలంలోని కూచిపూడి సచివాలయం వద్ద మంగళవారం పంటసాగుదారు హక్కు పత్రాల (సీసీఆర్సీ కార్డుల)పై అవగాహన, ప్రత్యేక ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూ యజమానులు ఏ విధమైన అపోహలకు పోకుండా కౌలు రైతులకు సహకరించాలని, సీసీఆర్సీ కార్డులకు కేవలం 11 నెలలకు మాత్రమే వ్యాలిడిటీ ఉంటుందని, భూయజమానుల హక్కులకు ఏ విధమైన భంగం వాటిల్లదని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ కె. శివకుమార్, వీఆర్ఓ ఖాసిమ్, వీఏఏ జె. కుమార సోమేశ్వర్, గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడమే లక్ష్యం



మోపిదేవి జెడ్పీ పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలతో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేసి అభినందిస్తున్న ఎంపీపీ సంగా మధుసూదనరావు

గూడూరు: విద్యార్థులకు ఆసక్తి ఉన్న పెద్ద పెద్ద చదువులు చదివేలా వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను మంగళవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కష్టపడి చదవి మంచి మార్కులు సాధించేందుకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచి లింగం సులోచనా రాణి, రైల్వే బోర్డు సభ్యుడు మోటేపల్లి రత్నారావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కొల్లు వాసు, సీహెచ్‌సీ డైరెక్టర్ బత్తిన త్రినాథ, హెచ్‌ఎం డి.పుష్పలత, లింగం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలకు ఘన సన్మానం

మోపిదేవి: మండలంలోని జగనన్న ఆణిముత్యాలకు సన్మాన కార్యక్రమం మోపిదేవి జెడ్పీ పాఠశాలలో మంగళవారం పాఠశాల హెచ్‌ఎం జయంతి అధ్యక్షతన జరిగింది. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు శాలువా కప్పి, మెమెంటోలు అందజేసి సన్మానించారు. ప్రథమ స్థానం సాధించిన మేడికొండ మోనాకు రూ. 3 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన అర్జా అక్షయకు రూ. 2 వేలు, నడకుదుటి రాజేష్‌కు రూ. వెయ్యితో పాటు మెమెంటోను అందజేశారు. వీరితో పాటు స్థానిక జెడ్పీ ప్లస్‌లో అత్యధిక మార్కులు సాధించిన రాజులపాటి జ్ఞాన నాగ ప్రసన్న (426/470), గుంటూరు వాసవి (270/470)లను కూడా నగదుతో సత్కరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాల, జెడ్పీ ప్లస్‌లో అమలు చేస్తున్న విద్యా ప్రమాణాలను వివరించారు. సర్పంచ్ నందిగం మేరీరాణి, ఉప సర్పంచ్ కోనేరు సుందర్ సింగ్, చిట్టిబొమ్మ వెంకట రమణ, కోనేరు పద్మనాభ ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

ఎంపీడీఓ రెడ్డయ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ రెడ్డయ్య

పెడన: మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ వి. రెడ్డయ్య అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ గ్రేడ్–5 కార్యదర్శులతో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సర్వే సమయంలో చేపట్టాల్సిన అంశాలపై వలంటీర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులతోపాటు గృహ సారథులు పాల్గొంటారని, లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు ఏమైతే అందలేదో వాటిని నమోదు చేయాల్సి ఉంటుందని రెడ్డయ్య తెలిపారు. వలంటీర్ల ఫోన్లలోనే ఆ సమాచారాన్ని అప్పటికప్పుడే అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఓపీఆర్‌డీ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

మల్టీ విలేజ్ స్కీమ్ భూముల పరిశీలన



భూముల సరిహద్దులు పరిశీలిస్తున్న ఆర్డీఓ పద్మావతి, తదితరులు

గుడివాడ టౌన్(నందివాడ): మల్టీ విలేజ్ స్కీమ్ అమలుకు భూసేకరణ పనులు వేగవంతం చేయాలని ఆర్డీఓ పి.పద్మావతి కోరారు. మంగళవారం ఆమె ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నియోజకవర్గ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు రూ.160 కోట్లు మంజూరు చేశారు. ఈ నిధులతో జనార్ధనపురం సమీపంలోని పాములపాడు గ్రామానికి చెందిన 100 ఎకరాల్లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణానికి సేకరించిన భూముల సరిహద్దులను పరిశీలించారు. జనార్ధనపురం గ్రామంలో మల్టీ విలేజ్ స్కీమ్ ఫిల్టరేషన్ సముదాయం కొరకు 10.3 ఎకరాలు, తమిరిశ గ్రామ శివారు ఏబీ నగర్‌లో 30 సెంట్లు, రూరల్ మండలం మోటూరులో 30 సెంట్లు, రామనపూడిలో 30 సెంట్లు సేకరించామన్నారు. వాటికి సరిహద్దులు నిర్ణయించి త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ఎంవీఎస్ఎన్ రాజు, ఏఈలు ఎ. వెంకటేశ్వరరావు, రమేష్, అగ్రికల్చరల్ జాయింట్ డైరెక్టర్ ఎస్ పద్మావతి, ఏడీఈ రమాదేవి, గుడివాడ, నందివాడ, పెదపారుపూడి తహసీల్దార్‌లు కె.ఆంజనేయులు, వి.భవన్నారాయణ, వి.నాగభూషణం, నందివాడ మండల వ్యవసాయ సలహా సంఘం చైర్మన్ కె.కుమార్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ జయరాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథుడి రథయాత్ర

ముదినేపల్లి రూరల్ : వడాలి శ్రీజగన్నాథస్వామివారి రథయాత్ర మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆషాఢ విదియ తిథి సందర్భంగా రథయాత్రను ప్రారంభించారు. ఈ రథయాత్ర గ్రామంలో ముదినేపల్లి బస్టాండ్ సెంటర్ వరకు తిరిగి 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం వరకు కొనసాగింది. తిరిగి వడాలి జగన్నాథస్వామి ఆలయానికి చేరుకుంది.

ఈ రథయాత్రను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఆలయ చైర్మన్ మర్రివాడ సుబ్బలక్ష్మి, వీరారెడ్డి దంపతులు పూజలు చేసి ప్రారంభించారు. రథయాత్రకు దారి పొడవునా భక్తులు ఘనస్వాగతం పలికి హారతులిచ్చారు. ఆలయ చైర్మన్ దంపతులు సొంత ఖర్చుతో నిర్మించిన ఆలయ స్వాగత ద్వారాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ రథోత్సవం, స్వాగతద్వారం ప్రారంభం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో పరిసర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడికి అభిషేకాలు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం – చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మంగళవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి పుట్టలో పాలుపోసి స్వామిని దర్శించుకుని అభిషేకాలు చేయించుకున్నారు. ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ఆధ్వర్యంలో ఈ అభిషేకాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య, పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

పమిడిముక్కల: విద్యా ప్రమాణాల పెంపు దిశగా పనిచేయాలని ఎంఈఓ–2 ఎస్.శ్రీనివాస్ ఉపాధ్యాయులకు సూచించారు. మంటాడ (మెయిన్) ప్రాథమిక పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. హెచ్‌ఎం ఆర్.ప్రకాశకుమారిని వివరాలు అడిగి తెలుసుకొన్నారు. రిజిస్టర్‌లు పరిశీలించారు. మెనూను పరిశీలించారు. పాఠశాలలోని వంటగది, ఆర్వో ప్లాంట్‌లను పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు తెలిపారు.

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ మచిలీపట్నం బ్రాంచి వారు ఇచ్చిన లీగల్ ప్రకారం యావన్మందికీ తెలుపునది ఏమనగా ఈ క్రింది షెడ్యూలులో చూపిన అబ్దుల్ అటీమ్ గారి కుమారుడు మొహమ్మద్ అబ్దుల్లా గారి స్థిరాస్తిని రిజిష్టర్ తనఖా చేసుకుని ఋణము ఇవ్వుటకు నిర్ణయించుకున్నాము. కావున సదరు వ్యవహారానికి సంబంధించి ఎవరికైనను ఎటువంటి అభ్యంతరాలు గానీ, [illegible] కోర్టు వివాదాలు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోపు ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకంగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరాలకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూల్ : కృష్ణాజిల్లా, మచిలీపట్నం సబ్‌రిజిస్ట్రార్ వారి పరిధిలో, మచిలీపట్నం టౌన్, [illegible], ఆర్.ఎస్. నెం. 311/3రు, మున్సిపల్ వార్డు–16, డోర్ నెం. 16/449–16రు కు సమీపమున గల దస్తావేజు నెం. 2899/2023రు లో ప్లాట్ నెం. 134రు దాఖలా 150 చ॥గజాల స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు హద్దులు. తూర్పు : 30 అ॥ల రోడ్డు, దక్షిణం : ప్లాట్ నెం. 135రు స్థలం, పడమర: ప్లాట్ నెం. 125రు స్థలం, ఉత్తరం: ప్లాట్ నెం. 133రు స్థలం.

యు.వి. సుబ్రహ్మణ్యేశ్వరరావు, న్యాయవాది, మచిలీపట్నం

CORRECTION OF NAME

I KORIMILLI VENKATA RAMESH KUMAR S/O KORIMILLI NARAYANA RAO, R/O Flat no. 303, Tejasree Towers, Plot no 346-347, Bandari Layout, Nizampet, Hyderabad 500090. My daughter's by name KORIMILLI SRI VAINAVI, appeared for 10th class CISCE through St. Francis E.M. High School Machilipatnam. In her 10th class marks sheet her name is wrongly mentioned as KORIMILLI SRIVAINAVI, but her actual name is **KORIMILLI SRI VAINAVI.**

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

మచిలీపట్నం డివిజన్

99122 20543 (మచిలీపట్నం, పెడన)

99122 20545 (అవనిగడ్డ)

Office mail : sakshiads@gmail.com